క్లుప్తంగా

భారీ మెజారిటీతో విజయమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



ప్రత్తిపాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించడమే లక్ష్యంగా కలిసి ముందుకు నడుద్దామని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండేపాడు, కోయవారిపాలెం, తిక్కిరెడ్డిపాలెం, బొర్రావారిపాలెం, నిమ్మగడ్డవారిపాలెం, ప్రత్తిపాడు, తిమ్మాపురం, రావిపాటివారిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. తిమ్మాపురంలో ఇరువర్గాలతో మాట్లాడారు. కలసి మెలిసి పనిచేద్దామని సూచించారు. మనస్పర్థలు పక్కనబెట్టి పార్టీ ఘన విజయంలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కొండేపాడులోని శ్రీ కైలాసపతి శివాలయాన్ని బలసాని కిరణ్‌కుమార్ సందర్శించారు. ఆలయంలో ప్రదక్షిణలు చేసిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు పెదకాకానిలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ

పెదకాకాని: మండల కేంద్రంలో శనివారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిస్కరణ కార్యక్రమం జరుగుతుందని గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 5 కోట్ల ఎంపీ నిధులతో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు.

శ్మశానంలో బోరు ఏర్పాటు



గుంటూరు రూరల్: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం తురకపాలెం గ్రామం బీసీ కాలనీ వాసుల శ్మశాన వాటికలో రూ.2 లక్షలతో బోరు ఏర్పాటుకు ఎంపీపీ శంకుస్థాపన చేశారు. ఇప్పటికే శ్మశాన వాటికకు ప్రహరీ ఏర్పాటు చేశామని, గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎంపీపీ తెలిపారు. గ్రామ సర్పంచ్ డబ్బారి సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లెపాడులో ఎన్నికల ప్రచారం

తెనాలిటౌన్: రూరల్ మండలం మల్లెపాడు గ్రామంలో మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు సత్యనారాయణ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి పినపాటి భారతీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, మాజీ ఎంపీటీసీ నిరంజన్, పార్టీ నాయకులు గంగయ్య, అనిల్‌కుమార్, యోహాన్, సీయోను, ప్రసాద్ పాల్గొన్నారు.

శుక్రవారాన్ని డ్రైడేగా పాటించండి



తెనాలిఅర్బన్: అందరూ శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని మలేరియా తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ కోరారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో బీసీ కాలనీలో శుక్రవారం దోమల నియంత్రణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లో ఉన్న నీళ్ల క్యాన్‌లు, తొట్టెలను శుభ్రం చేయాలని కోరారు. ఇవన్నీ దోమల ఉత్పత్తికి కారకాలని వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి శివనాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవం.. కల్యాణ బ్రహ్మోత్సవం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య దంపతులు



పూజా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకాకాని శివక్షేత్రం మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ సమన్వయకర్త కిలారి వెంకటరోశయ్య దంపతులు, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ శివశంకరరావు, సభ్యులు, అర్చకులు వారికి సాదర స్వాగతం పలికారు. ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదపండితులు స్వామి ఆశీర్వచనం అందించి, శేషవస్త్రంతో వారిని సత్కరించారు.



కూచిపూడి నృత్యప్రదర్శన

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

మహా శివారాత్రి పర్వదినం కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను కనువిందు చేశాయి. గుంటూరుకు చెందిన ఎ.అనితారావు, అను డాన్స్ అకాడమి, కె.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులు అద్భుతంగా కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు.

‘మేము సిద్ధం.. మా పొన్నూరు సిద్ధం’

- నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలి వెళ్లేందుకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న వైఎస్సార్ సీపీ పొన్నూరు అసెంబ్లీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పొన్నూరు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి తీసుకెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేస్తామని పార్టీ పొన్నూరు నాయకులు అన్నారు. ఆదివారం బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం మేదరమెట్ల వద్ద నిర్వహించనున్న సిద్ధం సభను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు సిద్ధం పోస్టర్ ఆవిష్కరించారు. పొన్నూరు జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, పార్టీ బాపట్ల పరిశీలకులు డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, ముస్లిం నాయకులు షేక్ నాజర్‌లు మాట్లాడారు. పోస్టర్ ఆవిష్కరణలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు, మునిపల్లె పీఏసీఎస్ చైర్మన్ కోటా శ్రీనివాసరావు, నాయకులు పఠాణం ప్రసాద్, బత్తుల గోవిందరాజు, ప్రసాదు, షేక్ మున్ని, వెంకటేశ్వరరావు, ఆకుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభకు ఏర్పాట్లు పూర్తి..

వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ నేతృత్వంలో నియోజకవర్గ నాయకులు సిద్ధం సభకు తరలి వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పొన్నూరు పట్టణం నుంచి 269 బస్సులు సిద్ధం సభకు తరలి వెళ్లనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. పొన్నూరు పట్టణం నుంచి 62 బస్సులు, నియోజకవర్గంలోని మిగిలిన గ్రామాల నుంచి 207 బస్సులు బయలుదేరనున్నాయి. సభకు వచ్చే కార్యకర్తలకు బస్సులలోనే భోజన ఏర్పాట్లు చేశారు. పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ బస్సులోనే ప్రయాణించనున్నారు.

సిద్ధం సభకు కార్యకర్తలతోనే ప్రయాణం



మేదరమెట్ల వద్ద ఆదివారం జరగనున్న సిద్ధం సభకు పొన్నూరు నియోజకవర్గం నుంచి తరలిరానున్న వేలాదిమందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఆదరణ పెరిగింది. ప్రభుత్వం చేసిన మేలును ప్రజలు మరువరు. సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. బస్సులో కార్యకర్తలతో కలిసి సభకు వెళ్తాను.

– అంబటి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పొన్నూరు అసెంబ్లీ సమన్వయకర్త

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణం14వ వార్డు పరిధిలోని ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు శుక్రవారం సచివాలయం వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లా గురునాథగుప్తా, వార్డు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ వసంతరావు, శేషాచలం

31వ వార్డులో...

తెనాలిఅర్బన్: తెనాలి నియోజకవర్గంలో 27 వేల ఇళ్ళ స్థలాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని 31వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి పేర్కొన్నారు. 31వ వార్డు పరిధిలోని సచివాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రావి శ్రీనివాసరావు, రాయల్ ప్రతాప్, కృష్ణ, మోహన్‌రావు, మరియమ్మ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ మానసరెడ్డి

ముగిసిన సేవా పథకం శిబిరం

తెనాలిఅర్బన్: జేఎంజే కళాశాల ఆధ్వర్యంలో చావావారిపాలెం గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సేవా పథక ప్రత్యేక శిబిరం శుక్రవారం ముగిసింది. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని రోడ్లు, కాల్వలను శుభ్రం చేయడంతో పాటు వివిధ ప్రాంతాల్లో మొక్కలను నాటారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో 28వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ యాతాటి అనిల్, ఘంటా కిరణ్, ఫిలిప్, బెజిమెన్, అధ్యాపకులు డాక్టర్ అరుణ సుజాత పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: మహా శివరాత్రిని పురస్కరించుకుని శివాజీచౌక్‌లోని కాశీమాత ఆలయం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుమ్మడి రమేష్, కార్యదర్శి వై.శ్రీనివాసరావు, సభ్యులు మేక సురేష్, కందేపు సీతారామయ్య, నీరంజన్, మెడికల్ సుబ్బారావు, అడపాల శ్రీనివాసరావు, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

వీడియో, ఫొటోగ్రాఫర్ల కొవ్వొత్తుల ర్యాలీ

తెనాలిఅర్బన్: మధురవాడకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయికుమార్‌ను హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని తెనాలి వీడియోగ్రాఫర్స్ అండ్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సాయికుమార్ హత్యను నిరసిస్తూ పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సాయికుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఇలాంటి దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు.



క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

ఏపీ క్రిస్టియన్ రైట్స్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ జాన్‌బాబు

తెనాలిటౌన్: భారతదేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో మతోన్మాదులు క్రైస్తవులపై దాడుల చేస్తున్నారని ఆ దాడులను అరికట్టాలని ఏపీ క్రిస్టియన్ రైట్స్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ మర్రిపూడి జాన్‌బాబు కోరారు. రూరల్ మండలం కఠెవరంలో చర్చి వద్ద శుక్రవారం ఆర్గనైజేషన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జాన్‌బాబు మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ జనవాడలో అగ్రకులస్తులు దళిత క్రైస్తవులపై దాడుల చేసి రాళ్ళురువ్వి అద్దాలు పగలుకొట్టిన ఘటన సంచలనం సృష్టించదన్నారు. సమావేశంలో ఆర్గనైజేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రదర్ ఆనంద్‌కుమార్, సెక్రటరీ పాస్టర్ అబ్రహం, జాయింట్ సెక్రటరీ పాస్టర్ శ్యామ్‌సన్, కోశాధికారి పాస్టర్ రమేష్, పాస్టర్లు చిట్టిబాబు, జక్రయ్య పాల్గొన్నారు.



కఠెవరంలో చర్చి వద్ద మాట్లాడుతున్న ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ జాన్‌బాబు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

తాడేపల్లి రూరల్: త్వరలో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతూ దుగ్గిరాల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పలు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేంద్ర మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, నార్త్‌జోన్ డీఎస్పీ రవికాంత్ ఆదేశాల మేరకు ఎన్నికలు, ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ప్రతి ప్రాంతంలో కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. దుగ్గిరాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతలపూడి, ఈమని, పెరుకలపూడి గ్రామాల్లో స్థానిక సిబ్బందితో పాటు సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కలసి కవాతు నిర్వహించామని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది, దుగ్గిరాల పోలీస్‌స్టేషన్ సిబ్బంది ప్రసాద్, సురేష్, శివాజీ, హెడ్ కానిస్టేబుల్ హసీన్ పాల్గొన్నారు.



పెరుకలపూడిలో కవాతు నిర్వహిస్తున్న ఎస్ఐ మహేంద్ర తదితరులు

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

తాడికొండ: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పనిచేస్తున్న పోలీసు శాఖకు ప్రజలు సహకారం అందించాలని తుళ్లూరు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాజధాని ప్రాంతమైన మందడం, మల్కాపురం, వెలగపూడి గ్రామాల్లో శుక్రవారం కేంద్ర బలగాలతో మార్చ్‌ఫాస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలలో ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మహిళలకు కుట్టుమెషిన్ల పంపిణీ



తెనాలి: మహిళల ఆర్థిక స్వావలంబనే దేశ ప్రగతిగా భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రాంతీయ అధికారి నోరి ప్రసాద్ చెప్పారు. మహిళా భ్యున్నతిలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా వెలుగొందుతోందని అభిప్రాయపడ్డారు. స్థానిక బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జేఎంజే మహిళా కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైనీని సత్కరించారు. భారతీయ స్టేట్‌బ్యాంక్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా తాడిశెట్టి పూజిత, షేక్ రజియా, సాదికలకు కుట్టుమిషన్లను అందజేశారు. చీఫ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, హెచ్ఆర్ మేనేజర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని నిడుబ్రోలు గోపాలస్వామి ఆశ్రమంలో వృద్ధులకు వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పండ్లు పంపిణీ చేశారు. - పొన్నూరు

ఘనంగా మహిళా దినోత్సవం



కేక్ కట్‌చేస్తున్న మహిళలు



సుభాషిణిని సన్మానిస్తున్న సభ్యులు

పెదనందిపాడు(కాకుమాను): మహిళా అభ్యున్నతితోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మోహనరావు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతితోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించి వారిని ప్రోత్సహించాలన్నారు. లింగ సమానత్వం, సమస్యల పరిష్కారానికి మహిళలు సాగించిన పోరాటాలు, సాధించిన విజయాలు గురించి ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు సమాజంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి సుభాషిణి, పలువురు మహిళలను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో

గుంటూరు రూరల్: ఏటుకూరు గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకులు కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచారు. పలువురు మహిళా కార్యకర్తలకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్‌లు, యార్డ్ డైరెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్‌తో గ్రామాల్లో రోడ్లు ధ్వంసం

- టోల్ ఫీజు కట్టకుండా వాహనాల మళ్లింపు
- నిరసనకు దిగిన గ్రామస్తులు

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలంలోని గొడవర్రు చుట్టుపక్కలున్న ఇసుక రీచ్‌ల నుంచి లోడు లారీలు టోల్ ప్లాజా ఫీజు కట్టకుండా గ్రామాల్లోని చిన్నచిన్న రహదారుల్లో నుంచి గుంటూరు నగరానికి వెళ్లడంతో పలుచోట్ల బీటీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పండగ అని కూడా చూడకుండా శుక్రవారం చిలువూరుకు చెందిన యువకులు, గ్రామ పెద్దలు లారీల్ని అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టోల్ ప్లాజా ఫీజు చెల్లించకుండా వెళ్లేందుకు లారీ డ్రైవర్లు 40 నుండి 50 టన్నుల బరువుతో అతివేగంగా వెళ్లడంతో చిలువూరు, నంబూరు రోడ్‌లో వెళ్లడం వల్ల రహదారులు పూర్తిగా ధ్వంసం అయ్యాయని తెలిపారు.

లారీలు వచ్చే సమయంలో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. లారీ వస్తుంటే అది వెళ్లేంత వరకు వాహనాలు రోడ్డు పక్కకు తీసి ఆపాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు ఓవర్‌లోడ్‌తో తిరిగే లారీలను అడ్డుకోవాలని, నిర్ణయించిన రహదారిలో గుంటూరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో గ్రామంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని చిలువూరు గ్రామస్తులు తెలియజేశారు.



చిలువూరు నంబూరు రహదారిలో వెళ్తున్న లారీని అడ్డుకున్న చిలువూరు గ్రామస్తులు

ముస్లింలకు న్యాయం చేసిన ముఖ్యమంత్రి జగన్

తాడేపల్లి రూరల్ : రాష్ట్రంలో ముస్లింలకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి న్యాయం చేశారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. వైఎస్సార్ సీపీ ఏడు అసెంబ్లీ సీట్లు కేటాయిస్తే టీడీపీ ఒక్కరికి మాత్రమే సీటు ఇవ్వడం ముస్లింపై వారికున్న చిత్తశుద్ధి వ్యక్తమవుతోందని తెలిపారు. చంద్రబాబునాయుడు ముస్లింలపై కపట ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. రంజాన్ తోఫా ఇవ్వడం లేదని విమర్శలు గుప్పిస్తున్న టీడీపీ నేతలు సంవత్సరానికి ఒక్కసారి ఇచ్చే రూ. 200 సరుకులతో ముస్లింల జీవితాల్లో ఏ విధంగా అభివృద్ధి సాధ్యమవుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, రాజకీయంగా సముచిత స్థానం కల్పించారని తెలిపారు. అన్ని రంగాల్లో ముస్లింల అభివృద్ధికి, సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ జాన్ సైదా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సుభాని

అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా మహిళలు

తాడికొండ: సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రాజకీయ రంగాల్లో పురుషులకు దీటుగా మహిళలు ముందంజలో నడుస్తున్నారని మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడికొండ కో–ఆపరేటివ్ సొసైటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైఎస్సార్ సీపీ నాయకులు బెజ్జం సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దయాసాగర్ మాట్లాడుతూ గతంలో మహిళల ప్రాతినిధ్యం అన్ని రంగాల్లో ఎక్కువగా ఉండేది కాదని, నేడు సాధికారత సాధిస్తున్నారంటే అంబేడ్కర్ కన్న కలలు కళ్ల ముందు సాక్షాత్కారం అవుతున్నాయని తెలిపారు. ఏపీలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాటల్లోనే కాకుండా చేతల్లో చూపించి, నేడు మహిళా ప్రతినిధులు ఎంతో మందికి రాజకీయ రంగంలో ప్రాతినిధ్యం కల్పించినట్లు చెప్పారు. అనంతరం తాడికొండ సర్పంచ్ తోకల సరోజిని, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, సొసైటీ చైర్మన్ షేక్ నగీనా, నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారితో పలువురిని సన్మానించారు.